క్లుప్తంగా

తెనాలిలో సదరం క్యాంప్ పునఃప్రారంభం



తెనాలిఅర్బన్: వికలాంగుల ధృవపత్రాలను పునః పరిశీలన జరిపే కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో బుధవారం ప్రత్యేక సదరం క్యాంప్‌ను నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సదరం క్యాంప్‌ను అధికారులు నిర్వహించారు. ఈఎన్‌టీ, అప్తామాలజీ, ఆర్థోపెడిక్, సైక్రాటిక్ విభాగాలకు చెందిన వికలాంగులకు వైద్య పరీక్షలు చేశారు. క్యాంప్‌లో పలు ప్రభుత్వ వైద్యశాలలకు చెందిన వైద్యులు పరీక్షలు నిర్వహించారు. గురు, శుక్రవారాల్లో కూడా సదరం క్యాంప్ కొనసాగుతుందని వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి తెలిపారు.

ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం

తెనాలిటౌన్: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేశారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి కఠెవరపు దేవానంద్ కొనియాడారు. స్థానిక గంగానమ్మ పేటలోని ఆయన పార్టీ కార్యాలయంలో బుధవారం వైఎస్సార్ సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండా ఆవిష్కరించి కార్యకర్తలకు మిఠాయిలు పంపిణీ చేశారు. పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం ఐదు సంవత్సరాల పాటు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేసిన కృషి గుర్తు చేసుకున్నారు. అమ్మ ఒడి, జగనన్న కాలనీల ఏర్పాటు వంటి సంక్షేమ పథకాలు చరిత్రలో లిఖించదగ్గదిగా వెల్లడించారు. కార్యక్రమంలో పలువురు ఎస్సీ సెల్ నాయకులు పాల్గొన్నారు.


అద్దెకు తిప్పుతున్న ప్రైవేటు కార్లకు జరిమానా

తెనాలిరూరల్: ప్రైవేటు కార్లను(తెల్ల నంబరు ప్లేటు ఉన్న వాటిని) నిబంధనలకు విరుద్ధంగా అద్దెకు తిప్పుతున్నారని, వాటిపై చర్యలు తీసుకోవాలని ఇటీవల గ్రీవెన్స్‌లో జిల్లా అధికారులకు ఫిర్యాదు అందింది. ఈ నేపథ్యంలో రవాణా శాఖ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. తెనాలి ప్రాంతీయ రవాణా అధికారులు బుధవారం ఇటువంటి వాహన తనిఖీల ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. తెనాలి ప్రాంతీయ రవాణా కార్యాలయ పరిధిలోని నారాకోడూరు వద్ద మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ తోట రాఘవరావు, సహాయ మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ గోలి అమృతరాణి కార్ల తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా అద్దెకు తిప్పుతున్న రెండు కార్లను గుర్తించారు. ఒక్కో కారుకు రూ. 14 వేల చొప్పున జరిమానా విధించి, చేబ్రోలు పోలీసులకు అప్పగించారు. అలానే పత్రాలు సరిగా లేని మరో 10 కార్లకు జరిమానా విధించారు. ప్రైవేటు కార్లను అద్దెకు తిప్పి పట్టుబడితే రూ. 20 వేల వరకు జరిమానా విధిస్తామని, ఎక్కడ పట్టుబడితే అక్కడే వాహనాన్ని స్వాధీనం చేసుకుంటామని ఎంవీఐ రాఘవరావు ఈ సందర్భంగా తెలిపారు. ప్రజలు ఇటువంటి కార్లను అద్దెకు తీసుకుని ఇబ్బందులకు గురికావద్దని ఆయన సూచించారు.

క్షయ వ్యాధిపై అవగాహన

తెనాలిరూరల్: క్లాప్స్ సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని అంగలకుదురులో గల బీసీ హాస్టల్‌లో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ డాక్టర్ పల్లికొండ రవికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ క్షయ వ్యాధి అంటువ్యాధి అని, ఇది వంశపారంపర్యంగా వచ్చే వ్యాధి కాదని కేవలం గాలి ద్వారా మాత్రమే ఒకరి నుండి మరొకరికి వ్యాప్తి చెందుతుందని తెలిపారు. రెండు వారాల మించి దగ్గు రెండు వారాలు మించి జ్వరం దగ్గినప్పుడు కళ్లెబడటం, బరువు తగ్గిపోవడం, ఆకలి లేకపోవడం, రాత్రిపూట చెమటలతో కూడిన జ్వరం రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయని వివరించారు. క్లాప్స్ సొసైటీ అధ్యక్షుడు ఉప్పలపాటి గోవింద్ మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నవ్యక్తులను గుర్తించి దగ్గర్లో ఉన్న గవర్నమెంట్ హాస్పిటల్‌కి పంపించాలని సూచించారు. బీసీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ జి.సరోజినీ, పి.సౌజన్య, ఏఎన్‌ఎం ఎస్. లక్ష్మీ కుమారి, ఆశా కార్యకర్తలు అమూల్య, సమాధానం, ఇతర వైద్య సిబ్బంది, క్లాప్స్ సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నాంచారమ్మ తల్లి తిరునాళ్ల



కొల్లూరు: నాంచారమ్మ తల్లి తిరునాళ్ల ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయ నిర్వాహక కమిటీ ఏర్పాట్లలో నిమగ్నమైంది. మండలంలోని పెసర్లంకలో గురువారం జరగనున్న తిరునాళ్లను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. తిరునాళ్లలో భక్తులకు అసౌకర్యం ఏర్పడకుండా ఆలయ పరిసర ప్రాంతాలను శుభ్రం చేయించడంతోపాటు ఆలయం చుట్టూ వాహనాలు, పశువులు ప్రదక్షిణాలు చేసేందుకు వీలుగా మార్గం ఏర్పాటు చేశారు. నాంచారమ్మ తల్లి ఆలయం చెంతనే ఉన్న శివాలయం ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. పోలీసు సిబ్బంది భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

ప్రజా పక్షమే జగనన్న పక్షం

- మేనిఫెస్టోనీ అమలు చేసి చూపిన ఘనత వైఎస్సార్ సీపీదే
- వారి కోసం పోరాడటమే మా అజెండా
- పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్. పక్కన చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలి: దేశచరిత్రలో ఎన్నికల మేనిఫెస్టోను తుచ తప్పక అమలుచేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని ఆ పార్టీ తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. 45 ఏళ్లు, వందేళ్లు అని చెప్పుకుంటున్న పార్టీలకు అలాంటి చరిత్ర ఏమాత్రం లేదన్నారు. వైఎస్సార్ సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం స్థానిక గంగానమ్మ పేటలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే శివకుమార్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, కేక్‌ను కట్‌చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల్లో ఇతర పార్టీలు కూటమిగా పోటీ చేశాయని, వైఎస్సార్ సీపీ మాత్రమే ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు ఒంటరిగానే పోటీ చేసినట్లు గుర్తుచేశారు. ప్రజలు విశ్వసించి 2019లో జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టినపుడు అయిదేళ్ల కాలంలో మేనిఫెస్టోలోని హామీలను 98 శాతంపైగా అమలు చేసి, రూ.2.89 లక్షల కోట్ల సంక్షేమాన్ని ప్రజలకు అందించామని గుర్తుచేశారు. 2024 ఎన్నికల్లో పార్టీ మేనిఫెస్టో కోసం ప్రజలు ఆసక్తిగా ఎదురుచూశారని చెబుతూ, తాను ప్రకటించిన సంక్షేమానికి మించి అందించటం, తనతోసహా ఏ ఇతర పార్టీకి సాధ్యం కాదని జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్టు తెలిపారు. అయినా కూటమి పార్టీలు అలవికాని సూపర్‌సిక్స్ హామీలతో ప్రజలను ఏమార్చి అధికారంలోకి వచ్చాయని చెప్పారు.

రాజకీయ నాయకుడు అంటే ప్రజలకు ఏదైతే చెప్పామో...అది కచ్చితంగా పాటించాల్సి ఉంటుందన్నారు. తెనాలి నియోజకవర్గంలో రూ.1900 కోట్ల సంక్షేమాన్ని అందించిన ఘనత ఈరోజు వరకు తనకు మాత్రమే దక్కుతుందని గర్వంగా చెప్పుకుంటున్నానని శివకుమార్ స్పష్టంగా చెప్పారు. ఎన్నికల్లో ఓటమి చెందినా వైఎస్సార్ సీపీ జెండా, పార్టీ అజెండా రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమం మాత్రమేనని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ ప్రజల పక్షాన చిత్తశుద్ధితో పనిచేస్తామని చెప్పారు.

సూపర్ సిక్స్ హామీలెక్కడా?

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మాట్లాడుతూ ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని చెప్పారు. కూటమి నేతలు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు ఇప్పటి వరకు నెరవేర్చలేదని గుర్తుచేశారు. పార్టీ పట్టణ అధ్యక్షులు మద్దాళి శేషాచలం, షేక్ దుబాయ్‌బాబు, తెనాలి మండల పార్టీ అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, కొల్లిపర మండల అధ్యక్షుడు అవుతు పోతిరెడ్డి తమ ప్రసంగాల్లో సంక్షేమ క్యాలండరును ప్రకటించి మరీ సంక్షేమాన్ని అందించిన చరిత్ర జగన్ మోహన్ రెడ్డిదేనని చెప్పారు. వైఎస్సార్ సీపీ వాళ్లకు పనులు చేయొద్దని సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పడాన్ని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కౌన్సిలర్లు వీర్లపాటి విజయలక్ష్మి, మల్లెబోయిన రాము, బచ్చనబోయిన శ్రీనివాసరావు, భీమవరపు సంజీవరెడ్డి, బూరెల దుర్గాప్రసాద్, సిరికృష్ణ, మన్నవ ప్రభాకర్, వంపుగళ్ల కృష్ణ, కొమ్ము రాయల్, ప్రసాదం సురేష్, కాకి దేవసహాయం, కాళిదాసు సత్యం, బొంతు నరేంద్రరెడ్డి, దేవరపల్లి కిశోర్, కఠెవరపు దేవానంద్, కుర్రా శ్రీను, చుండూరు వెంకటేశ్వరరావు, బ్రదర్ ఆనందన్న, వంగా సుధాకరరెడ్డి, అత్తోట చంటి, అక్కిదాసు కిరణ్‌కుమార్, కుర్రా జస్వంత్ పాల్గొన్నారు.



పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే శివకుమార్

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయిస్తే చర్యలు తప్పవు

మున్సిపల్ కమిషనర్ శేషన్న



మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను విక్రయించిన, ఉపయోగించిన కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న హెచ్చరించారు. రజక చెరువులోని ఐలమ్మ పార్కు వద్ద బుధవారం స్వచ్ఛత దివాస్ కార్యక్రమంలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. 120 మైక్రాన్‌ల లోపు ఉన్న ప్లాస్టిక్ వస్తువులు, కవర్లను ప్రభుత్వం నిషేధించిందని తెలిపారు. వాటిని ఉపయోగించడం వలన పర్యావరణానికి హానీ జరిగే అవకాశాలు ఎక్కువని తెలిపారు. ఈ నెల 15వ తేదీన పట్టణంలో ప్లాస్టిక్ వస్తువుల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. తమ వద్ద ఉన్న 120 మైక్రాన్‌ల లోపు మందం ఉన్న వస్తువులను తెచ్చి ఇచ్చి అక్కడ పంపిణీ చేసే పంచదార, సేమ్యా, టమోటా, కోడిగుడ్లు, పాలప్యాకెట్లలో ఏదో ఒకదానిని తీసుకు వెళ్లాలని సూచించారు. సమావేశంలో పలువురు మున్సిపల్ అధికారులు, వాకర్స్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ కష్టాలు తీరేదెలా?

- మార్కెట్ కూడలిలో యథేచ్ఛగా ఆటోల నిలుపుదల
- చోద్యం చూస్తున్న పోలీసులు



మార్కెట్ వంతెన వద్ద యూ-టర్న్ వద్ద నిలిపి ఉన్న ఆటోలు

తెనాలిరూరల్: తెనాలిలో ప్రజలకు ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడం లేదు. పెరిగిన వాహన రద్దీతో అవస్థలు పడుతుంటే అధికారుల ఉదాసీనత ప్రజలకు ట్రాఫిక్‌లో తలనొప్పి తెప్పిస్తున్నాయి. అత్యంత రద్దీగా ఉండే మార్కెట్ వంతెన వద్ద ఆటోలను ఇష్టారీతిన రోడ్డుపై నిలుపుతుండడం ఇక్కడ ట్రాఫిక్ సమస్యను మరింతగా పెంచుతోంది. మారిస్‌పేట, చెంచుపేట నుంచి, కొత్తవంతెన వైపు నుంచి మార్కెట్ ఏరియాకు వెళ్లే వారు నేరుగా వెళ్లేందుకు వీలు లేదు. గంగానమ్మపేట వంతెన వద్ద యూ-టర్న్ తీసుకుని రావాలి. ఈ వంతెన వరకు ఫరవాలేదనిపించినా.. మార్కెట్ వంతెన వద్ద డివైడర్ మధ్య యూ-టర్న్ కోసం అధికారులు అవకాశం కల్పించారు. ఇక్కడే రోడ్డు వెంబడి ఆటోలను నిలుపుతున్నారు. ప్రధాన రహదారి కావడంతో వాహనాల తాకిడి ఎక్కువ ఉంటుంది. రద్దీ సమయాల్లో ఇక్కడ వాహన రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇక్కడ వాహనాలు యూ-టర్న్ తీసుకునే సమయంలో వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా లారీలు, బస్సులు కార్లు వచ్చిన సమయంలో వాహనాలు ఎక్కడికక్కడ నిలచిపోవాల్సి వస్తోంది. పశ్చిమ డెల్టా ప్రధాన పట్టణం కావడంతో తెనాలికి పరిసర గ్రామాల్నుంచి ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ముఖ్యంగా మార్కెట్‌కు ఎక్కువగా వస్తుంటారు. ఇదే మార్కెట్ వంతెన వద్ద వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నా పోలీసులు పట్టించుకోవడంలేదు. ఆరు ప్రదేశాల్లో లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేసి రోడ్డు భద్రత గురించి ఆడియో పెడుతు న్నారు మినహా క్షేత్ర స్థాయిలో ట్రాఫిక్ ఇబ్బందుల గురించి పట్టించుకోవడంలేదు. మార్కెట్ వంతెన, బస్టాండ్‌వంతెనల వద్ద రోడ్డు వెంబడి పాసింజర్ ఆటోలను నిలుపుతుండడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నా పోలీసులకు మాత్రం పట్టడం లేదు. ఆటో యూనియన్ల నుంచి నెలవారీ మామూళ్లు అందుతుండడంతో వారిని వాహనాలను ఈ వంతెనల వద్ద నిలుపకుండ చర్యలు తీసుకోవడంలేదన్న ఆరోపణలూ వినిపిస్తున్నాయి.

సాంకేతికతను అందిపుచ్చుకుని ఉన్నతంగా రాణించాలి

- డిప్యూటీ కలెక్టర్ ఆర్.చంద్రముని
- ఏపీ స్కిల్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా



నియామకపత్రాలు అందజేస్తున్న డిప్యూటీ కలెక్టర్ చంద్రముని

తెనాలిటౌన్: విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకుని జీవితంలో ఉన్నతంగా రాణించాలని ఐటీఐ విద్యార్థులకు డిప్యూటీ కలెక్టర్ ఆర్.చంద్రముని సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక చినరావూరులోని ఐటీఐ కళాశాలలో బుధవారం జాబ్ మేళా నిర్వహించారు. ముత్తూట్ మని లిమిటెడ్, హెచ్ఆర్ సొల్యూషన్స్, శ్రీ పేమెంట్స్, ఇన్స్నేప్ సోర్స్ తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొని విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలో 25 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు డిప్యూటీ కలెక్టర్ ఆర్ చంద్రముని చేతుల మీదుగా నియామకపత్రాలు అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణ, అంకిత భావంతో విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నంతంగా రాణించాలని ఆయన ఆకాంక్షించారు. యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని స్పష్టం చేశారు. స్కిల్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జాబ్‌మేళాలు చేపట్టి చదువుకునే విద్యార్థులు, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పిస్తున్నట్లు తెలియజేశారు. ఈ క్రమంలోనే తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో పలు ప్రవేట్ కంపెనీల భాగస్వామ్యంతో జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులు చదువుకుంటునే ఉద్యోగం చేసుకోవచ్చని స్పష్టం చేశారు. తద్వారా కుటుంబ ఆర్థిక ఉన్నతికి తోడ్పాటును అందించిన వారు అవుతారని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో స్టేప్ ఆఫీసర్ జె.రాధిక, స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ డి.రాజా, ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రావి చిన వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

హామీలు అమలు చేయడంలో కూటమి నిర్లక్ష్యం

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ ఆరోపణ



మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్

తెనాలిటౌన్: ఎన్నికల హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం నిలువెల్లా నిర్లక్ష్యం కనబరుస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక నందులపేట గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలోబుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అధికార దాహంతో అలవికాని హామీలను ఇచ్చి అడ్డదారిలో మోసపూరితంగా ఎన్‌డీఏ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టిందని మండిపడ్డారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేద ప్రజలకు పట్టణంలో 2 సెంట్లు, గ్రామంలో 3 సెంట్ల ఇళ్ల స్థలం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చినట్లు గుర్తు చేశారు.

అధికారంలోకి రాగానే హామీని గాలికి వదలివేసి రాష్ట్రం అప్పుల్లో ఉందని సన్నాయి నొక్కులు నొక్కుతున్నట్లు విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకపోతే ఈ నెల 22వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా లబ్ధిదారులతో కలసి తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. అదే విధంగా ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షల రూపాయలు ఆర్థికసాయం చేస్తానన్నా వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ తెనాలి నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, సీనియర్ నాయకులు పరుచూరి వెంకటేశ్వరరావు, ఎ.రవితేజ, ఏఐవైఎఫ్ అధ్యక్షులు ఆకుల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

బాగా చదివి.. మంచిపేరు తీసుకురండి

అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు



విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేస్తున్న ఏసీ లక్ష్మీపతిరావు

తెనాలిఅర్బన్: విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిడుబ్రోలు కృష్ణవేణి వాటర్ ప్లాంట్ వారి సహకారంతో ఐతానగర్‌లోని ఎన్ఎస్ఎస్ఎంహెచ్ స్కూల్‌లో 10వ తరగతి చదివే విద్యార్థులకు పరీక్ష రాసే అట్టలు, పెన్నులు, స్కేల్, ఇతర వస్తువులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు మల్లిబోయిన తేజ, తిరుమలశెట్టి ఉమాశంకర్, పోలిశెట్టి విజయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి, బెల్లకొండ వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

16న బొల్లిముంత చాయమ్మ సంస్మరణ


- ఏడున హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతి
- సీపీఐ (ఎంఎల్) మాజీ సభ్యురాలిగానూ సేవలు



తెనాలి: సీపీఐ (ఎంఎల్) ఉద్యమ మాజీ సభ్యురాలు బొల్లిముంత చాయమ్మ సంస్మరణ సభను ఈనెల 16వ తేదీన ఉదయం 10 గంటలకు కొత్తపేటలోని ఎన్జీవో కళ్యాణమండపంలో జరగనుంది. తెనాలికి చెందిన చాయమ్మ ఈనెల ఏడో తేదీన హైదరాబాద్‌లో గుండెపోటుతో హఠాత్తుగా మృతిచెందారు. రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బొల్లిముంత సాంబశివరావు సతీమణి చామ్మ. ఆమె జన్మస్థలం ఒడిశాలోని కోరాపుట్ జిల్లా జైయపూర్. ఆమె తండ్రి ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తూ, ప్రెస్ వర్కర్స్ యూనియన్ బాధ్యతలు నిర్వహిస్తున్న క్రమంలో, ప్రస్తుత రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీతో పరిచయంతో పార్టీ రాజకీయ సంబంధాల్లోకి వచ్చారు. పార్టీ నిర్ణయం ప్రకారం బొల్లిముంత సాంబశివరావుతో వివాహం 1985లో నిరాడంబరంగా జరిగింది. వివాహ అనంతరం సాంబశివరావు పార్టీ బాధ్యతలు నిర్వహించిన రేపల్లె, నిజాంపట్నంలలో ఎక్కువకాలం ఉన్నారు. చాయమ్మ ప్రధానంగా పార్టీ నాయకత్వం కేటాయించిన పనులను నిబద్ధతతో నిర్వహించారు. చాలా కాలం ఆమె సెంటర్ నుంచి నిర్వహించే 'జనశక్తి, క్లాస్ స్ట్రగుల్ పత్రికల బైండింగ్, పోస్టింగ్ బాధ్యతలు నిర్వహించారు. మహాసభల నిర్వహణ సందర్భంలో పార్టీ అప్పగించిన ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించారు. 2009 పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి ఇల్లా రామిరెడ్డి ప్రచార టీం కి బాధ్యత వహించారు. కొండమొదలు ప్రాంతంలో ప్రచారం చేశారు. 2013లో పార్టీ నిర్ణయం మేరకు సభ్యత్వం స్వీకరించారు. 2020 వరకు సభ్యురాలుగా కొనసాగారు. ఆ తర్వాత కూడా పార్టీ ఉద్యమాలకు సహకరిస్తూనే ఉన్నారు. బొల్లిముంత చాయమ్మకు మహిత, అనూష ఇద్దరు కుమార్తెలు. చిన్న కూతురు అవసరాల కొద్ది కాలంగా హైద్రాబాద్ ఉంటున్నారు. తీవ్రమైన గుండెపోటుతో అక్కడి కార్పొరేట్ ఆసుపత్రిలో మృతిచెందారు.

గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేయవద్దు

డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఈ అన్నపూర్ణ



మాట్లాడుతున్న డిప్యూటీ డాక్టర్ అన్నపూర్ణ

తెనాలిఅర్బన్: గర్భస్థ శిశులింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ హెచ్చరించారు. గర్భస్థ శిశులింగ నిర్ధారణ చట్టం అములులో భాగంగా కొత్తపేటలోని డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో కార్యాలయంలో బుధవారం తెనాలి డివిజన్ స్థాయి సలహా సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో జరిగే భ్రూణ హత్యలను నియంత్రించడానికి ప్రభుత్వం గర్భస్థ శిశులింగ నిర్ధారణ చట్టాన్ని తీసుకువచ్చిందని గుర్తు చేశారు. గర్భంలో ఉన్నది ఎవరు అనేది తెలియ చేయకూడదని సూచించారు. కొందరూ గర్భంలో ఆడ శిశువు ఉన్నది అని తెలియగానే భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దానిని నియంత్రించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు తెలియజేయమనే బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా వైద్యశాల వైద్యులు డాక్టర్ హరిణీ, డాక్టర్ సురేష్, డాక్టర్ వినీల్, సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.సునీల్ కుమార్, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు ముమ్మనేని భానుమతి, నాళం శ్రీమన్నారాయణ, పెనుగొండ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధులపై అవగాహన ఉండాలి

తహసీల్దార్ కె.వి.గోపాలకృష్ణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలిఅర్బన్: కీటక జనిత వ్యాధుల పట్ల ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ కె.వి.గోపాలకృష్ణ సూచించారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో యడ్లలింగయ్య కాలనీలో వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిల్వల వలన దోమల వ్యాప్తి పెరుగుతుందన్నారు. దోమ కుట్టడం వలన అనేక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని చెప్పారు. దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మలేరియా అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, అందె బాలచంద్రమౌళిలు మాట్లాడుతూ నీటి నిల్వలు ఉన్న చోట్ల మడ్డి ఆయిల్ పోసుకోవాలని సూచించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేయడంతో పాటు జ్వరాలతో బాధపడే వారి వివరాలు సేకరించడం జరుగుతుందన్నారు. అలాగే వారికి రక్త పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మలేరియా సూపర్‌వైజర్లు బందారు మల్లేశ్వరరావు, దాసరి శివనాగ మల్లేశ్వరరావు, షేక్ రషీద్, సయ్యద్ కరిముల్లా, వీఆర్వో కామేశ్వరరావు, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ తిరునాళ్లకు ఏర్పాట్లు పూర్తి

కొల్లూరు: తిరుపతమ్మ తిరునాళ్ల మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండలంలోని దోనేపూడిలోని తిరుపతమ్మ ఆలయంలో గురువారం తిరునాళ్ల జరగనుండటంతో ఆలయం వద్ద బుధవారం ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేయడంతోపాటు భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఆలయం వెనుక భాగంలో భక్తులు పొంగళ్లు తయారు చేసుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. ఎండలు మండుతుండటంతో భక్తులు ఎండ దెబ్బకు గురవకుండా పొంగళ్లు, ఇతర వంటకాలు చేసుకునే ప్రాంతంలో టెంట్లు ఏర్పాటు చేశారు. రాత్రి వేళలో జరిగే తిరునాళ్ళలో ప్రజలు కొనుగోలు చేసుకునేందుకు వీలుగా సుమారు 4 ఎకరాల పొలంలో దుకాణాలతోపాటు, జైంట్‌వీల్, ట్రైన్ వంటి వినోదపు క్రీడా యంత్రాలను అమర్చారు.

26న బార్ అసోసియేషన్ ఎన్నికలు

రేపల్లె రూరల్: బార్ అసోసియేషన్ ఎన్నికలను ఈ నెల 26వ తేదీన బార్ అసోసియేషన్ హాలులో నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి నూతన కమిటీ ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, జనరల్ సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, లైబ్రెరీ సెక్రటరీ, కోశాధికారి, క్రీడలు సాంస్కృతిక కార్యదర్శి, మహిళా ప్రతినిధి, కార్యనిర్వాహక సభ్యులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఈ నెల 17, 18 తేదీల్లో సాయంత్రం 4.30 గంటల వరకు నామినేషన్‌ల స్వీకరణ, 19న నామినేషన్‌ల పరిశీలన, ఉపసంహరణ, 26వ తేదీ బుధవారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఎన్నికలు నిర్వహించటం, అదేరోజు సాయంత్రం ఓట్ల లెక్కింపు, గెలుపొందిన అభ్యర్థులను ప్రకటించటం జరుగుతుందని చెప్పారు. ఆసక్తి ఉన్న కార్యవర్గ సభ్యులు ఎన్నికల్లో పోటీ చేయవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకై బార్ అసోసియేషన్ హాలులో సంప్రదించాలని కోరారు.